ఈవారం కథ

# కుర్రాడి మనసు

కొరుకొండ సత్యానంద్



మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది.

రవికి ఏమీ తోచడం లేదు. చల్లగా వుంటుందని అమ్మ, అక్క ఇద్దరూ నేల మీదే పడుకున్నారు. తనూ పడుకుందామని అనుకున్నాడు. కానీ నిద్ర రావడంలేదు. పోనీ బయటకువెళ్ళి ఆడుకుందామనుకుంటే పిల్లలందరూ ఇళ్ళలోనే వున్నారు. ఎండ మండిపోతోందని పిల్లలెవర్నీ బయటకి రానివ్వడం లేదు తల్లి దండ్రులు. రవిని కూడా వాళ్ళమ్మ ఎండలో ఆడొద్దని గట్టిగా చెప్పింది. పడుకునే ముందు వీథి తలుపువేసి పైగెడ పెట్టేసింది. పడుకోమని చెప్పి అక్క ప్రక్కన తలగడ వేసింది. ఇంటి పనులుచేసి బాగా అలసిపోయారేమో, భోజనాలు అయిం తరువాత వాళ్ళకు బాగా నిద్రపట్టేసింది.

ఎటొచ్చీ రవికే నిద్రపట్టక, బయట ఆడుకోడానికి వీలుకుదరక ఏమీ తోచడంలేదు. తిరుగుతున్న ఫ్యాను వైపు, గోడలవైపు, అటకవైపూ చూస్తూ పడుకున్నాడు. గదిలో చల్లగానే వుంది. కానీ కొద్దిగా చెమట పడుతూంది. ప్రక్కకు తిరిగి చూశాడు. అక్క తెలివిగా వుంటే ఏవైనా కబుర్లు చెప్పేది. తనకూ కాలక్షేపం అయ్యేది. కానీ అక్క గాఢంగా నిద్రపోతోంది. అక్క నుదుటిమీద చెమట... రవికి చేతికందే దూరంలో కుర్చీ మీద టవల్ వుంది. దాన్నందుకున్నాడు. వాళ్ళక్క నుదుటినీ, మెడనీ తుడిచాడు. కొస్త గట్టిగానే తుడిచాడు. అలా తుడవడం వలన అక్కకి తెలివి వస్తుందేమో అనుకున్నాడు. తెలివొస్తే మాట్లాడుతూ కాలం గడపొచ్చు అనుకున్నాడు. కానీ వాళ్ళక్క ఏ మాత్రం లేవలేదు. అలాగే గట్టిగా ఊపిరి పీలుస్తూ, వదులుతూ పడుకుంది. చేయడానికేమీ లేక తన చదువు, స్కూలు గురించిన ఆలోచనల్లో పడిపోయాడు రవి.

... ఆరో తరగతి పరీక్షలై పోయాయి. వేసవి సెలవులు ఇచ్చేస్తారు. వచ్చే నెల పధ్నాలుగో తారీఖున మళ్ళీ స్కూలు తెరుస్తారు. తనిప్పుడు ఆరులోంచి ఏడులోకి వస్తాడు. ఏడో తరగతిలో పబ్లిక్ పరీక్షలు. రేపట్నుంచి సెలవులవగా నాన్న అన్నారు. "ఇంతవరకు అందరూ వస్తారు. ఇక్కడే చాలా మంది ఆగిపోతారు. ఎందుకంటే ఈ ఏడు పబ్లిక్ పరీక్షలుంటాయి. పోయిందంటే ఏడుస్తూ మళ్ళీ ఏడు చదవాల్సిందే. అంచేత సెలవుల్లో గాడిదలాగా తిరక్కుండా ప్రక్కవీథిలో సాయిబాబా పుస్తకాలు తెచ్చుకుని తిరగేస్తుండు..."

నాన్న అలాగే మాట్లాడతారు. నన్ను మొద్దు అని ఎప్పుడూ అనరు గానీ బాగా చదువుతున్నానని

మాత్రం మెచ్చుకోరు. మా టీచర్లైతే యూనిట్ టెస్టుల్లో, క్వార్టర్లీ, హాఫియర్లీ పరీక్షల్లో ఫస్ట్ వస్తే 'వెరీగుడ్' అంటారు. నాకు ఫస్ట్ చాలా తక్కువ సార్లు వస్తుంది. ఎక్కువసార్లు సెకండ్ వస్తుంది. అరమార్కు, ఒక మార్కు తేడాతో ఫస్టెక్కువగా ఆ వరలక్ష్మికే వస్తుంది.

ఈసారి సెవెన్త్ కాబట్టి, పబ్లిక్ పరీక్షలు కాబట్టి అన్ని ఫస్టులూ నాకేవచ్చేలా ఇంకా బాగా చదవాలి.

అన్నట్టు మా స్కూల్లో ఏడో తరగతి నుండి బిల్డింగు మారిపోతుంది. ఆ బిల్డింగులో అయితే క్లాసు రూములన్నీ బాగుంటాయి. వెడల్పాటి బ్లాక్ బోర్డు వుంటుంది. టీచర్లు రంగు సుద్దము క్కలు వాడతారు. వాళ్ళు నిల్చోడానికి అరుగులాగా వుంటుంది. పిల్లలు కూర్చోడానికి వెడల్పాటి కొత్త బల్లలు, రాసుకోవడానికి ముందు బెంచీలు వుంటాయి. అవి ముందుకి ఏటవాలుగా వున్న చోట పుస్తకం పెట్టి సుఖంగా రాసుకోవచ్చు. పెన్నులు, పెన్సిళ్ళు క్రిందకి జారి పడిపోకుండా ఏటవాలుకి క్రింద చిన్న బద్దలాగా వుంటుంది. జారిపోయినవి అక్కడికొచ్చి ఉండిపోతాయి. వేగంగా సెలవులైపోతే బాగుణ్ను, స్కూలుకెళ్ళిపో వచ్చు. కొత్త పుస్తకాలు, కొత్త క్లాస్ రూమ్, కొత్త బెంచీ, బల్ల...

అలా తనలో తనే అనుకుంటున్నాడు రవి. అంతలో ఓ ఎలుక ఆ గోడ మూలకి వచ్చింది. అది అటూ ఇటూ చూస్తుంది. బోర్లా పడుకున్న రవి అరచేత్తో నేలమీద కొట్టాడు. ఆ శబ్దానికి అది గది తలుపు క్రిందనున్న ఖాళీలోంచి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

అది వంటగదిలోకి వెళ్ళడంతో రవికి వంటగది, ఆ గదిలో వుండే బియ్యం డబ్బా గుర్తొచ్చాయి. అంతే, స్కూలు గురించిన ఆలోచనల్ని వదిలేసిలేచి వంటగదిలోకి వెళ్ళాడు. తరువాత ఆ మూలనున్న బియ్యం డబ్బా మూతతీసి చూశాడు.

'ఇంకా ఉన్నాయన్నమాట...' తనలో తనే అనుకుని డబ్బాలో వున్న నాలుగు మామిడిపళ్ళలో ఒకదాన్ని తీసుకుని, బాత్రూమ్‌లో నీళ్ళకుండీ గట్టు మీద కూర్చున్నాడు.

అయిదు నిముషాల్లో మామిడిపండు తినడం అయిపోయింది. మూతి, చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు. టవల్తో తుడుచుకుంటూ వరండాలోకి వచ్చాడు. వరండా కిటికీ దగ్గరే నిల్చొని బయటకు చూశాడు.

ఎండ గట్టిగానే కాస్తుంది. బయట పిట్టకూడా కన్పించడం లేదు. అందరిళ్ళ తలుపులూ వేసేసి వున్నాయి. మరో రెండు గంటలుపోతేనే గానీ ఎండ తగ్గేట్టు లేదు. అప్పుడుగానీ ఎవరూ బయట తిరగేట్టు లేరు. అప్పటికి ఆఫీసులు కూడా వది లేస్తారు. అయిదున్నర అయితేనే కానీ నాన్నగారు ఇంటికి రారు. అందరూ ఇంటి దగ్గర వుంటే పెద్దవాళ్ళు ఆఫీసుల్లో వుంటారు. పని చేస్తారు. స్కూళ్ళన్నింటికీ ఎండాకాలం సెలవులిచ్చినట్టుగానే ఆఫీసులకి కూడా ఎందుకివ్వరో? పాపం, వాళ్ళకి ఎండ గొడవ వుండదేమో? అప్పుడెప్పుడో నాన్నగారు చెప్పారు, ఇంట్లో కన్నా ఆఫీసుల్లోనే బాగుంటుందని, ఎందుకంటే నాన్నగారు కూర్చునే గది చల్లగా వుంటుందట. వాళ్ళాఫీసులో మూడు ఏసి మిషన్లున్నాయట. బయట ఇంత ఎండ కాస్తున్నప్పుడు గదిలో అంత చల్లగా వుంటే ఎంత బాగుంటుందో! నేను పెద్ద వాడన్నయ్యాక ఆఫీసులో చేరతానుగా, అప్పుడు నేనూ ఏసీ మిషనున్న గదిలో హాయిగా కూర్చుంటాను.

కిటికీ దగ్గర నిల్చున్న రవి కాసేపు అలా ఏవేవో అనుకున్నాడు. ఏమీ తోచక, ఏమీ చెయ్యడానికి లేక అనుమానంగా అటూ ఇటూ తిరిగాడు కాసేపు. ఆ తరువాత రవికో ఆలోచన వచ్చింది.

ఒక్కసారి బయటికి వెళ్ళి అలా తిరిగొస్తేనో!? అమ్మ, అక్క ఇప్పట్లో లేచేలా లేరు. ఈ లోగా అలా బయటికి వెళ్ళి వచ్చేయొచ్చు అనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా వీధి తలుపుగెడ తీశాడు. తరువాత గెడపట్టుకుని తలుపుని లాగాడు. తలుపు కొంచెం ముందుకి వచ్చింది గానీ వదిలెయ్యగానే మళ్ళీ పడిపోయింది. అప్పుడు చూశాడు పైకి. పై గెడవేసి వుంది. వరండాలో వున్న కుర్చీని లాగాడు. కుర్చీ ఎక్కాడు. ఇప్పుడు రవికి పై గెడ అందింది. గెడ తీసి కుర్చీ దిగాడు. కుర్చీని యథాస్థానంలో పెట్టేశాడు. తరువాత తలుపు తీసి బయటకు వెళ్ళాడు. బయట నుండే వీధి తలుపు గెడవేశాడు. గుమ్మం దిగి బయట పడ్డాడు.

ఓ పదడుగులు ముందుకి వేశాడు. ప్రక్క రోడ్లో కూడా ఎవ్వరూ కన్పించలేదు. కొంతమంది మాత్రం బాల్కనీల్లో కూర్చుని రోడ్లవంక చూస్తున్నారు. వాళ్ళకు కూడా నాలాగే ఏమీ తోచట్లేదులాగుంది అనుకున్నాడు.

బయటికైతే వచ్చాడు గానీ ఎక్కడికి వెళ్ళాలో తోచలేదు రవికి. ఒక్క నిముషం ఆ వీధి చివర గట్టుదగ్గర నిల్చొని ఆలోచించాడు. ఎండవల్ల అప్పటికప్పుడే ఒళ్ళు వేడెక్కి పోయింది. అయినా ఇంటికి వెళ్ళాలన్పించలేదు.

రవి కప్పుడు అలా వాళ్ళ స్కూలు దగ్గరకు వెళ్ళాలన్పించింది. రవి వాళ్ళింటికి స్కూలు దగ్గరే. పది నిముషాలు నడిస్తే వచ్చేస్తుంది. స్కూలు వరకూ వెళ్ళి మళ్ళీ వచ్చేయొచ్చు అనుకున్నాడు. వెంటనే రవి అటువైపు అడుగులు వేశాడు.

పది నిముషాల్లో స్కూలు దగ్గరకు చేరుకున్నాడు. సందడి సందడిగా వుండే స్కూలు ఇప్పుడు నిశ్శబ్దంగా వుంది. తనలాగే ఒంటరిగా, ఏమీ తోచని దాన్లా వుంది. చుట్టూ ఎత్తైన ప్రహరీ. ఎదురుగా ఆ పెద్ద ఇనుప గేటు. గేటు దగ్గరకు వెళ్ళాడు రవి. గేటుదగ్గర ఎప్పుడూ వాచ్‌మెన్ వుంటాడు – కానీ రవికిప్పుడు వాచ్‌మెన్ కన్పించలేదు. ఎక్కడికో వెళ్ళివుంటాడు అనుకున్నాడు. లేకపోతే మా లాగే అతనికీ సెలవు లేమో అనుకున్నాడు.

గేటు కొద్దిగా తెరచుకొనే వుంది. లోపలకు వెళ్ళాడు రవి. గేటు దాటిం తరువాత విశాలమైన ఖాళీ స్థలం. ఇంటర్వెల్‌లో స్కూలు అయిపోయిం తరువాత అక్కడే పిల్లలందరూ గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటారు. ఆ ఖాళీ స్థలం తరువాత స్కూలు బిల్డింగు. అందులో ఒకటి నుండి ఆరో తరగతి వరకూ వుంది. బిల్డింగు కాస్త ఎత్తులో వుంటుంది. బిళ్ళ పెంకుల్తో వున్న ఆ బిల్డింగు చాలా సంవత్సరాల క్రిందట కట్టింది.

రవి మెట్లెక్కాడు. ఆ తలుపు ఎప్పుడూ తీసే వుంటుంది. దగ్గరకువేసి వున్న ఆ తలుపుని నెమ్మదిగా తోసి లోపలకు వెళ్ళాడు. ఎడమవైపు వున్న హెడ్మాస్టారుగారి రూమ్ వైపు చూశాడు. ఆ గదికి తాళంవేసి వుంది. కుడిచేతి ప్రక్క పొడవుగా వున్న హాలు. ఆ హాలుకి ప్రక్కగా వరుసగా క్లాసు రూములు. ఆరో తరగతి క్లాస్‌రూమ్ హెడ్మాస్టరు రూమ్‌కి దగ్గరగా వుంటుంది. క్లాస్ రూములన్నీ



*** వాపసు ***

"అయ్యా! రిటర్నింగు ఆఫీసురుగారూ, మా నాయకుడు గారు, నిన్న దాఖలు చేసిన నామినేషను ఫారమూ, డిపాజిట్టు డబ్బూ వాపసు యిచ్చేయమన్నారు."

"అదెందుకండీ"

"ఆయన మనసు మార్చుకున్నారు. పక్క జిల్లాలో దాఖలు చేసుకుంటారట"

– వి.వి. శీతారామదాసు,
గుంటూరు

తాళాలు వేసి వున్నాయి. రవి ఆరో తరగతి చదివిన క్లాస్ రూమ్ కూడా తాళం వేసే వుంది. అయితే ఇటు వైపుకి వున్న రెండు కిటికీల్లో ఒకదాని ఒక రెక్క ఈ మధ్యనే ఊడిపోయింది. అందుచేత ఆ కిటికీ దగ్గర నిల్చుంటే క్లాస్ రూమ్ అంతా కన్పిస్తుంది. రవి ఆ కిటికీ దగ్గరకు వెళ్ళి నిల్చున్నాడు. క్లాసునంతా ఒక్కసారి కలియజూశాడు. తరువాత బ్లాక్ బోర్డు వైపు చూశాడు. పరీక్షల ముందు అయిన ఆఖరు క్లాసులో రాధా టీచరు రాసిన పరీక్షల టైమ్‌టేబుల్ ఇంకా అలాగే వుంది. ఆ తరువాత తను కూర్చునే చోటు వైపు చూశాడు. రవిది రెండో వరుసలో రెండో బెంచీలో అటువైపు మొదటి సీటు.

అదిగో నా చోటు. నా ప్రక్కనే ప్రకాష్ గాడిది. వాడూ, నేనూ మూడో తరగతి నుండీ ప్రక్క ప్రక్కనే కూర్చొనేవాళ్ళం. ఏ పరుసైనా నాదెప్పుడూ రెండో బెంచీలో ఏదో వైపుండే చివరి సీటే, వాడిది రెండో సీటే. ఎప్పుడూ నాకెలాగైతే సెకండ్ మార్కు వస్తుందో, వాడికీ ఎప్పుడూ థర్డ్ మార్కే వస్తుంది. అయితే అప్పుడప్పుడూ నాతో సమానంగా మార్కులొచ్చి సెకండ్ మార్కు వచ్చేది వాడికి. కానీ పాపం వాడికెప్పుడూ ఫస్టు రాలేదు. ఫస్టు తనకే వస్తుందని పెద్ద గొప్ప ఆ వరలక్ష్మికి. ప్రకాష్ గాడూ నేనూ క్లాసులో నోట్సులు కలిసి రాసుకుంటుంటాం. మా ఇద్దరి ఇళ్ళూ దూరం కాబట్టి స్కూల్లో తప్ప బయట కలవడానికి వీలవ్వదు.

కిటికీ దగ్గర నిలబడి తనలో తనే అలా అనుకున్నాడు రవి. ఆ తరువాత అక్కడ నిలబడే మిగతా క్లాస్ రూములవైపు చూశాడు. ఆ చివరి నుండి ఈ చివర వరకూ వచ్చిన నేను ఇప్పుడు క్రొత్త బిల్డింగ్‌లోకి వెళ్తానన్నమాట అనుకున్నాడు. అలా అనుకున్నప్పుడు రవికి ఎంతో గర్వం కలిగింది. అందుకే తను వెళ్ళబోయే బిల్డింగ్‌ని, తను చదవబోయే క్లాస్ రూమ్‌ని, తను కూర్చోబోయే చోటునీ చూడాలన్పించింది. వెంటనే అక్కడి నుండి బయటకు వచ్చి ఈ పాత బిల్డింగు ఎడమవైపు నుండి అటువైపుకి వెళ్ళాడు.

పాతబిల్డింగ్‌కి క్రొత్త బిల్డింగుకీ మధ్య పాతిక గజాల దూరం వుంటుంది. రవి పాత బిల్డింగుని దాటి క్రొత్త బిల్డింగు వైపుకి నడిచాడు.

ఎదురుగా ఏడో తరగతి నుండి పదో తరగతి వరకూ వున్న కొత్త బిల్డింగు. ఈ చివర పదో తరగతి క్లాసు రూము, తరువాత తొమ్మిది, ఎనిమిది. ఆ చివర్న ఏడో క్లాస్ రూమ్. సెలవులైపోయాక రవి వెళ్ళబోయే క్లాస్ రూమ్ అదే!

రవి ఈ చివర నుండి నడుచుకుంటూ వెళ్తున్నాడు. పదో తరగతి, తొమ్మిది, ఎనిమిది క్లాసు రూముల్ని దాటాడు.

తరువాత ఏడో తరగతి క్లాస్ రూము దగ్గరకు వచ్చి ఆగాడు. మొదటి మూడు క్లాసు రూములకూ తాళాలు వేసి వున్నాయి. ఈ రూము తలుపులు కూడావేసి వున్నాయి కానీ తాళంవేసి లేదు. అందుకు రవి చాలా ఆనంద పడ్డాడు. తలుపు తీసి లోపలకు వెళ్ళి రెండో వరుసలో రెండో బెంచీలో తను కూర్చోబోయే మొదటి సీటుని చూద్దామని, కాసేపు కూర్చుందామని అనుకున్నాడు. అందుకే వేసి వున్న తలుపుల్ని నెమ్మదిగా తోశాడు. కానీ అవి తెరచుకోలేదు. ఈసారి కొంచెం గట్టిగా త్రోశాడు. అయినా అవి తెరుచుకోలేదు.

రవికి ఆశ్చర్యం కలిగింది. ప్రక్కకు తిరిగి కిటికీల వైపు చూశాడు. ఒక కిటికీ రెక్కలు తీసి వున్నట్టుగా బయటకి కన్పిస్తున్నాయి. ఒక్క అంగలో ఆ కిటికీ దగ్గరకి వెళ్ళి ఆతృతగా లోపలకు చూశాడు. అలా చూసిన రవి కిటికీ ఊచల్ని పట్టుకుని అలాగే వుండిపోయాడు.

** ** ** **

పధ్నాలుగో తేదీ...

ఆ హైస్కూలు ఆవరణంతా పిల్లలతో కోలాహలంగా వుంది. పిల్లలందరూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఒకర్నొకరు సంతోషంగా పలకరించుకుంటున్నారు. క్రొత్త క్లాసులకు వెళ్తున్నామన్న ఆనందం వాళ్ళ ముఖంలో స్పష్టంగా కన్పిస్తుంది.


ఇంత హడావుడికీ, ఆనందానికీ భిన్నంగా హైస్కూలు ఆవరణలో రవి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. మనిషి చాలా నిరుత్సాహంగా వున్నాడు.

"ఇదేంట్రా ఇలా వున్నావ్? స్కూలు మొదటి రోజున చాలా హుషారుగా ఉండేవాడివి కదా ఎప్పుడూ?" బయల్దేరుతున్నప్పుడు అమ్మ అడిగిన ప్రశ్న రవి చెవుల్లో ఇంకా గింగుర్లు పెడుతోంది. ఆ ప్రశ్నకు సమాధానంగా ఏదో చెప్పాలన్న ఆవేశం అయితే కలిగింది గానీ ఎలా చెప్పాలో రవికి తెలియలేదు. అందుకే తల్లికి ఏమీ చెప్పలేదు.

పాత బిల్డింగు దాటి క్రొత్త బిల్డింగు దగ్గరకు వచ్చాడు రవి. అక్కడికొచ్చే సరికి నడక ఇంకా నెమ్మదైపోయింది. పది, తొమ్మిది, ఎనిమిది తరగతి గదుల్ని దాటి చివరనున్న ఏడో తరగతి గది గుమ్మం వరకూ వెళ్ళి ఆగి లోపలకు చూశాడు.

పాత బిల్డింగు దాటి క్రొత్త బిల్డింగు దగ్గరకు వచ్చాడు రవి. అక్కడికొచ్చేసరికి నడక ఇంకా నెమ్మదై పోయింది. పది, తొమ్మిది, ఎనిమిది తరగతి గదుల్ని దాటి చివరనున్న ఏడో తరగతి గది గుమ్మం వరకూ వెళ్ళి ఆగి లోపలకు చూశాడు.


శ్రీచక్ర సిమెంట్ నే వాడండి



సిరులు పొందండి!

SHREE CHAKRA CEMENT

శ్రీచక్ర సిమెంట్

GOLDSTAR CEMENTS LTD.
NARASIMHAPURI, GUNTUR DIST.

GOLDSTAR GROUP OF INDUSTRIES
GOLDSTAR CHAMBERS, AMEERPET, HYDERABAD – 500 016.

ULTIMATE PROTECTION

43 GRADE

అత్యుత్తమ రక్షణ

## చరిత్రలో మీ పుట్టినరోజు/పెళ్ళిరోజు



నా జన్మదినం 24-10-76. ఈ రోజునే ప్రపంచ శాంతి కోసం, ఐక్యత కోసం ఏర్పడిన ఐక్యరాజ్యస మితి దినం. నా జన్మదినానికి ఇంత ప్రాముఖ్యముండడం నాకు ఎంతో సంతోషంగా వుంటుంది.

—జి.ఇందిర
గవర్నరుపేట విజయవాడ-2

నేను అక్టోబరు 2వ తేదీ అంటే మహాత్మాగాంధీ జన్మదినం నాడు పుట్టాను. బాపూజీ జీవితం నాకు ఆదర్శం. శాంతి, సహనం, అహింస, ప్రేమ నా జీవిత గమ్యాలు. నాకు



వెంకటరమణాచారి
ఆర్.టి.సి. కాంప్లెక్స్ వెనుక, పిఠాపురం



నా పుట్టినరోజు 5-2-1966. రష్యా చంద్రమండలం చుట్టూ ఉప గ్రహాన్ని పరిభ్రమించినరోజు.

—గాదిరాజు రమాదేవి
విజయవాడ

లోపల పిల్లలంతా చాలా హడావుడిగా వున్నారు. ఒకళ్ళలో ఒకరు ఆనందంగా మాట్లాడుకుంటు న్నారు. ఆ చివర వరుసలో మొదటి బెంచీ దగ్గర, మధ్య వరుసలో రెండో బెంచీకి ఈ చివర మాత్రం పిల్లలు ఎందుకో వాదులాడుకుం టున్నారు. మధ్య వరుసలో రెండో బెంచీ దగ్గర జరుగుతున్న వాదులాటలో ప్రకాష్, రవి స్నేహి తుడు వున్నాడు. ఆ బెంచీకి ఈ చివర వుస్తకాల సంచీ పెట్టి ఆ ప్రక్కన ప్రకాష్ కూర్చున్నాడు. మరో కుర్రాడు ప్రకాష్‌తో వాదిస్తున్నాడు. మాట లైతే ఆ గొడవలో స్పష్టంగా వినిపించడం లేదుగానీ వాళ్ళిద్దరూ దేనిగురించో వాదులాడుకుంటున్నారని మాత్రం అర్థమవుతుంది వాళ్ళని గమనించిన వాళ్ళకి.

రవి క్లాసులోకి, మధ్య వరుసలో రెండో బెంచీ వైపు చూస్తున్నాడుగానీ ఆ విషయాలేవీ గమ నించడం లేదు. ఒక్క క్షణం తరువాత క్లాసు రూమ్‌లోకి వెళ్ళి మధ్య వరుస,, ఈ చివర వరస బెంచీల మధ్య నున్న ఖాళీలో నుంచి ఆ చివరకు నడుస్తున్నాడు.

సరిగ్గా అప్పుడు వినిపించింది 'ఒరే రవీ!' అని పిలిచిన ప్రకాష్ పిలుపు. ఆ పిలుపు రవికి వినిపిం చింది. ప్రకాష్ ఎందుకు పిలుస్తున్నాడో కూడా అర్థమైంది. కానీ వెనుతిరిగి చూడలేదు. నెమ్మ దిగా నడచుకుంటూ వెళ్ళి మొదటి వరుస చివరి బెంచీలో కూర్చున్నాడు. తరువాత తల కాస్త త్రిప్పి ముందుకు చూశాడు. ఎదురుగా ప్రకాష్ ఎంతో తొందరపడుతున్నట్టు చేతుల్తో రమ్మని రవిని పిలు స్తున్నాడు. రవి అటువైపే చూస్తున్నాడు కానీ ప్రకాష్‌కి సమాధానంగా ఏమీ చెప్పడం లేదు. భావరహితంగా వుంది రవి ముఖం.

ఒక నిముషం తరువాత సుడిగాలిలా వచ్చాడు ప్రకాష్.. "ఒరే రవీ, ఇదేంట్రా ఇక్కడ కూర్చు న్నావ్? నేను ఇందాకనగా వచ్చేసి రెండో బెంచీలో కూర్చుని నీ కోసం నా వుస్తకాల సంచివేసి చోటు వుంచాను. అక్కడికొచ్చెయ్!" అన్నాడు కంగారుగా.

రవి ప్రకాష్‌వైపు చూశాడు గానీ ఏమీ అన్లేదు.

"తొందరగా రారా... ఆ సత్తిబాబు గాడు నీ కోసం వుంచిన సీట్లో కూర్చుంటానని ఇందాక ట్నుంచీ గొడవ చేస్తున్నాడు. రవి, నేను ఎప్పుడూ ఈ రెండో బెంచీలో చివరే కూర్చుంటాం కదా, అని వాడితో వాదించి ఓడించాను. నువ్వు ఆలస్యం చేస్తే వాడు మళ్ళీ వచ్చేస్తాడు."

ప్రకాష్ కంగారు ప్రకాష్‌ది. అయినా రవి ఏమీ మాట్లాడలేదు. అది చూసి చిరాకు, కోపంకలిగాయి ప్రకాష్‌కి.

"ఏంట్రా మాట్లాడవ్? పెద్ద పోజు నువ్వొను. సెవన్త్‌లోకి వచ్చేవని స్టైలు చేస్తున్నావా? నువ్వేంటి, నేను సెవన్త్‌లోకే వచ్చేను. ఎప్పుడూ నీకు వాకంటే ఎక్కువ మార్కులొచ్చేసి గర్వం చూపిస్తున్నావా? నీ ప్రక్కన కూర్చుంటే నిన్ను అన్నీ అడిగి నీతో సమా నంగా మార్కులు సంపాదించేస్తానేమో అని అను కుంటున్నావా? అందుకే కదా అక్కడికి రమ్మంటే ఏమీ మాట్లాడ్డం లేదు?"

"ఒరే ప్రకాష్, నా ప్రక్కన కూర్చోవాలనుకుంటే ఇక్కడ కూర్చో" నెమ్మదిగా అన్నాడు రవి.

"ఏం నువ్వు అక్కడకు రాగూడదా, మనం ఎప్పుడూ రెండో బెంచీలోనే కదా కూర్చుంటాం?"

"అవుననుకో, ఈ సంవత్సరం ఇక్కడ కూర్చుందాం"

"ఎవడైనా రెండో బెంచీలోంచి మొదటి బెంచీలో కూర్చోవడానికి చూస్తాడుగానీ చివరి బెంచీలో కూర్చోడానికి చూడడు.

"నేనక్కడ కూర్చోనురా..."

"ఏం...?"

ఆ ప్రశ్నకే రవికి ఏం చెప్పాలో అర్థంకాలేదు. అందుకే ఏమీ చెప్పలేదు.

"ఎందుకో చెప్పరా.!." ప్రకాష్ మళ్ళీ రెట్టించాడు.

"ఏమీ లేదురా, కూర్చుంటే ఇక్కడ కూర్చో. లేక పోతే అక్కడికి వెళ్ళిపో..." అన్నాడు నెమ్మదిగా.

రవి అలా అనడంతో ప్రకాష్‌కి చిరెత్తుకొచ్చింది. పోరా. నేనక్కడే కూర్చుంటాన్లే. ఈ సంవత్సరం చూడు, నీకంటే ఎక్కువ మార్కులు సంపాది స్తాను. బ్యాక్ బెంచీలో కూర్చున్నావ్‌గా, ఇంక నువ్వు నాకంటే వెనుకే వుంటావు. ఆ..."

అలా అనేసి ఉక్రోషంగా వెళ్ళిపోయి రవి కోసం వుంచిన సీట్లో కూర్చున్నాడు ప్రకాష్. తరువాత ఒక్కసారి వెనక్కి తిరిగి రవివైపు చూసి నిర్లక్ష్యంగా తల త్రిప్పేసుకున్నాడు.

ప్రకాష్ ప్రవర్తన రవికి బాధ కలిగించినా... ఆ ప్రవర్తనకు కారణం తన మాటలే అని తెలిసినా ప్రకాష్ కోసం రవి ఆ బెంచీలోకి వెళ్ళలేదు.... వెళ్ళలేక పోయాడు.!

ఆ బెంచీ మీదే అప్పుడు వేసవి సెలవుల్లో తను వెళ్ళబోయే తరగతి గదిని, కూర్చోబోయే చోటునీ చూసుకుందామని వచ్చినప్పుడు రెండో వరుసలో మొదటి, రెండు బల్లల మీద బ్రాందీ సీసాలు, గ్లాసులు, సోడాలు, ఏవో పొట్లాలు పెట్టుకుని, త్రాగుతూ, తింటూ, పేకాడుతూ ఆ అయిదు గురూ రవికి కన్పించకపోయి వుంటే రవి అలా ప్రవర్తించి వుండేవాడు కాదు. ఆ కుర్రాడి మన స్సులో ఎప్పుడూ తను కూర్చునే చోటు మీద అంత ఏవగింపు కలిగి వుండేది కాదు.

అసలా తరగతి గదికే వెళ్ళకూడదని అనుకు న్నాడు. ఆ స్కూలుకే వెళ్ళకూడదనుకున్నాడు. కానీ అది వీలు కాదు. అందుకే తనకు వీలైన 'ఈ' పనిచేశాడని ప్రకాష్‌కేకాదు, ఎవ్వరికీ తెలీదు. ●